క్లుప్తంగా

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

సదుం: మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని సచివాలయం-2లో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఉదయం 10.30 గంటలకు ఆయన ప్రారంభిస్తారని, అలాగే వాటర్‌షెడ్ పథకం కింద సోమల, సదుం మండలాల రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

గడ్డివామి దగ్ధం : రూ.50వేల ఆస్తినష్టం


గడ్డివామి మంటలను ఆర్పుతున్న రైతులు

బైరెడ్డిపల్లి: గడ్డివామికి దగ్ధమై రూ.50వేల ఆస్తి నష్టం సంభవించిన ఘటన మండలంలోని తొరిడి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన క్రిష్ణమోహన్‌రెడ్డి తన పొలం వద్ద పాడి ఆవుల కోసం గడ్డి కొనుగోలు చేసి నిల్వ ఉంచాడు. బుధవారం రాత్రి ఆగంతకులు ఆ గడ్డివామికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన చుట్టుపక్కల రైతులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం శూన్యం. మొత్తం బూడిదైంది. గురువారం బాధిత రైతు రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాడు-నేడు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ శివరత్నమ్మ

సోమల: మండలంలోని కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు- నేడు పనులను గురువారం ఎంఈఓ శివరత్నమ్మ పరిశీలించారు.పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే సీఆర్సీ పరిధిలో నిర్వహిస్తున్న సమావేశానికి హాజరై ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

రాత్రి వేళ బయట సంచరించొద్దు

యాదమరి: మండల పరిధిలోని అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి వేళ బయట సంచరించరాదని తహసీల్దార్ హనుమంతు సూచించారు. గుడిపాల మండలం, తమిళనాడు సరిహద్దులో ఒంటరి ఏనుగు ముగ్గురి ప్రాణాలు తీసిందని, ఆ ఒంటరి ఏనుగు యాదమరి మండలం మీదుగా వెళ్లిందని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో అటవీప్రాంతాలు ఆనుకొని ఉన్న భూమిరెడ్డిపల్లె, పత్రపల్లె, మాదిరెడ్డిపల్లె, గొందివాళ్లవూరు. తాళ్లమడుగు, కీనాటంపల్లె, రాచూరు గ్రామీణ ప్రజలు సాయంత్రం 5 నుంచి ఉదయం 7 గంటల వరకు పొలాల వైపు వెళ్లరాదన్నారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. చందనాలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. రాత్రి ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించారు.

108లో ప్రసవం



చిత్తూరు రూరల్: గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేయడంతో గురువారం ఆడబిడ్డ జన్మించింది. చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన ప్రియదర్శినికి పురిటినొప్పులు అధికం కావడంతో కుటుంబీకులు ఉదయం 5.15 గంటలకు 108ను సంప్రదించారు. 5.35 గంటలకు అంబులెన్స్ గ్రామానికి చేరుకుంది. ఆమెను చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. వెంటనే ఈఎంటీ అనుసూయ, పైలెట్ లోకేష్ స్పందించి ప్రసవం చేశారు. దీంతో ఆ తల్లి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ,బిడ్డ సురక్షితం ఉన్నారని, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దండి



సన్మానం అందుకున్న ప్రధానోపాధ్యాయులైన పీడీలతో డీఈఓ విజయేంద్రరావు, స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భానుమూర్తిరాజు తదితరులు

- గ్రామస్థాయి నుంచి ఉన్నతస్థాయికి తీసుకెళదాం
- విజయవాణి సంస్థల అధినేత నాయుని చంద్రశేఖరమూర్తి పిలుపు
- ఆర్థికంగా చేయూతనిచ్చి ప్రోత్సహిస్తా
- క్రీడల నిర్వహణపై జిల్లా వ్యాయామోపాధ్యాయుల సమావేశం


నాయుని చంద్రశేఖర మూర్తిను సన్మానిస్తున్న డీఈఓ, ఐపీఈ తదితరులు

చౌడేపల్లె: ''ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను గుర్తించి, క్రీడల్లో శిక్షణ ఇచ్చి, వారిని మెరికల్లా తయారు చేయండి.. వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటి జిల్లాకు పేరు తేవాలన్నదే మన అందరి అభిమతం కావాలి..మీరు అలా జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను అందిస్తే శిక్షణ, పోటీలకు వెళ్లడానికి ఆర్థికంగా చేయూతనిస్తాను..ఇందుకు రూ. 5లక్షల నుంచి రూ.10 లక్షలైనా భరించడానికి సిద్ధం'' అని విజయవాణి విద్యాసంస్థల అధినేత నాయుని చంద్రశేఖరమూర్తి పీఈటీలు, పీడీల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.
గురువారం విజయవాణి రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో జిల్లా వ్యాయామోపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దేశ సరిహద్దులో రక్షణగా సైనికులు పోరాటం చేస్తుంటే, దేశం పరువు, ప్రతిష్ఠలను పొరుగుదేశాలకు చాటిచెప్పేలా క్రీడాకారులను తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత పీడీలు, పీఈటీలపై ఉందన్నారు. క్రీడల నిర్వహణ, క్రీడాకారుల శిక్షణకు తనవంతు తోడ్పాటునిస్తానన్న ఆయనను డీఈఓ విజయేంద్రరావు, ఐపీఈ భానుమూర్తి రాజు, పీఈటీలు ఘనంగా సన్మానించారు.

హెచ్‌ఎంలు అయిన పీడీలకు సన్మానం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఫిజికల్ డైరెక్టర్లుగా పనిచేస్తూ ప్రధానోపాధ్యాయులుగా, ఎంఈఓలుగా ఉద్యోగోన్నతి పొందిన పలువురిని డీఈఓ, ఐపీఈ చేతుల మీదుగా శాలువలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతల్లో కోమల(ఐరాల), నౌషాద్(నిడిగుంట, పుంగనూరు), నందకుమార్(అప్పినపల్లె, పెద్ద పంజాణి మండలం), సుబ్రమణ్యం (ఎంఈఓ2, గుర్రంకొండ), ఈశ్వర్‌రెడ్డి(వెంగళత్తూరు, పిచ్చాటూరు మండలం), మునస్వామి(బి.కొత్తకోట), చంద్రశేఖర్‌రెడ్డి(కుప్పం), మురళీకృష్ణ(గుడుపల్లె), కోటేశ్వరరావు(కార్వేటినగరం), రమ(గుడిపల్లె యామిగాలు), కేశవయ్య(శివరామాపురం, శాంతిపురం మండలం) తదితరులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 17మంది పీడీలు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందారని చెప్పారు.

క్రీడాపోటీల నిర్వహణకు అవకాశం ఇవ్వరూ!

కరోనా మహమ్మారి కారణంగా నాలుగేళ్లపాటు క్రీడాపోటీలు నిర్వహించలేదని పుంగనూరులో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడానికి అవకాశం ఇవ్వాలని చౌడేపల్లె పీడీ రామచంద్ర డీఈఓను కోరారు. అండర్-17 స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలు, అండర్-14 కబడ్డీ బాలికలతో పాటు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తామన్నారు. దీనిపై డీఈఓ సానుకూలంగా స్పందించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

పుంగనూరు: మానిటరింగ్ కమిటీలలో ప్రస్తావించిన ఎస్సీ, ఎస్టీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ సీతారామన్ ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కమిషనర్ నరసింహప్రసాద్‌తో కలసి తహసీల్దార్ నిర్వహించారు. సభ్యులు ప్రస్తావించిన వివిధ సమస్యలపై ఆయన అధికారులతో సమీక్షించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈఈ మహేష్, ఇతర అధికారులు, సభ్యులు రాజు, అశోక్, పెంచుపల్లి కృష్ణ, శ్రీనివాసులు, సర్పంచ్ ఆంజప్ప తదితరులు పాల్గొన్నారు.

జగనన్న జీవిత బీమాపై అవగాహన


సోమల : అవగాహన కల్పిస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె, పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లెలో స్థానిక ప్రజాప్రతినిధులకు జగనన్న జీవిత బీమాపై గురువారం జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు రూ.10 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని పార్టీ పరంగా కల్పించారని, సర్పంచులు, ఎంపీటీసీలు చొరవ తీసుకొని జీవిత బీమా కార్యక్రమాన్ని పటిష్టంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గంగాధరం, ఆవులపల్లె సర్పంచ్ కోదండరాజు, మాజీ ఎంపీటీసీ జిలాని, నేతలు రమణారెడ్డి, మనురాయల్ పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు గురువారం సదుంలో జీవిత బీమా నమోదు కార్యక్రమం నిర్వహించారు. సదుం, ఎర్రాతివారిపల్లె, నడిగడ్డ పరిధిలోని వారికి బీమా చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

మదర్ థెరిసా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే


కరస్పాండెంట్ చేతుల మీదుగా డిగ్రీ అందుకుంటున్న ఎంసీఏ విద్యార్థి

గంగవరం: మండలంలోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే గురువారం నిర్వహించారు. కళాశాలలో 2022- 23 ఏడాదిలో కోర్సు పూర్తి చేసిన ఎంసీఏ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు మాట్లాడుతూ, ఎంసీఏ విద్యార్థులకు రెండేళ్లలో కోర్సుకు సంబంధించిన విషయాలతో పాటు నైపుణ్యాన్ని పెంచేందుకు వివిధ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. చాలా మంది విద్యార్థులు క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించారన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

వైద్య విద్యతోనే గుర్తింపు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గుడుపల్లె: వైద్య విద్యతోనే సమాజంలో వైద్యులకు మంచి గుర్తింపు ఉంటుందని పీఈఎస్ మెడికల్ డైరెక్టర్ సురేష్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన పీఈఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సమాజంలో వైద్య విద్య ఎంతో ఉత్కృష్టమైనదన్నారు. విలువలు పాటిస్తూ, మంచి వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో విజేతలు, ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ క్రిష్టారావు, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, ర్యాలీ సుబ్బారావు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న హార్టికల్చర్ ఏడీ కోటేశ్వరరావు

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని మామిడి రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మామిడి కాయల కోత అనంతరం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ కోటేశ్వరరావు, శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్రరావు అవగాహన కల్పించారు. కాయలు కోసిన 15 నుంచి 20 రోజుల తరువాత అడ్డదిడ్డంగా పెరిగిన ఎండు కొమ్మలను పూర్తిగా కత్తిరించాలని, ఆ తర్వాత ఆ కొమ్మలకు సీఓసీని ఒక లీటరు నీటిలో కలిపి పూయాలన్నారు. పూత బాగా నిలవటానికి ఆర్కా మాంగోస్పెషల్ పోషకాన్ని ఒక లీటరు నీటిలో 8 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో పుంగనూరు హెచ్‌ఓ వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఉలవలు పంపిణీ


ఉలవలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ షేక్ సికిందర్

రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లె రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు ఉలవ విత్తనాలను స్థానిక సర్పంచ్ షేక్ సికిందర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయడానికి రైతులకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీపై ఉలవలు పంపిణీ చేస్తోందని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంజునాథ్, స్థానిక నేతలు లోకేష్, కుమార్, ప్రసాద్, గంగాధరం, సుధాకర్, ఆర్బీకే అధికారి కోమల పాల్గొన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

- సమస్యలను ప్రస్తావించిన కౌన్సిల్ సభ్యులు
- వచ్చే సమావేశానికి పరిష్కరిస్తామన్న చైర్‌పర్సన్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ పవిత్ర, హాజరైన కౌన్సిల్ సభ్యులు

పలమనేరు: పలమనేరు మున్సిపల్ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర అధ్యక్షతన గురువారం సమావేశం మొదలవుతుండగానే అధికార పార్టీ కౌన్సిలర్లు నాగరాజు, శ్యామ్‌సుందర్‌రాజు, హైదర్, నయాజ్, వైస్ చైర్మన్ కిరణ్ తదితరులు ప్రశ్నల వర్షం కురిపించారు. పట్టణ ఆవాసాల్లో నిబంధలకు విరుద్ధంగా వేస్తున్న లేఔట్లు, రాధా బంగ్లా ప్రాంతంలో లోఓల్టేజి సమస్య, పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఆక్రమణలు, బజారువీధిలో భారీ వాహనాలు పగటిపూట వెళ్తుండటంపై ప్రశ్నించారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను వచ్చే సమావేశానికికల్లా పరిష్కరించాలని చైర్‌పర్సన్ ఆదేశించారు.

ఇసుక అక్రమ రవాణా, జగనన్న స్థలాల అమ్మకాలపై చర్యలేవీ?

పట్టణంలోని గంటావూరులో కొందరు అధికారులతో కలసి జగనన్న ఇంటి స్థలాలను రూ.లక్షల్లో విక్రయిస్తున్నారని టీడీపీ కౌన్సిలర్ శారద ఆరోపించారు. పట్టణ సమీపంలోని కౌండిన్య నదిలో మంచినీటి పంపింగ్ పాయింట్ వద్ద సైతం ఇసుకను యథేచ్ఛగా తోడేస్తున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. తన వార్డులో రోడ్డు వేయాలని కోరారు. ఎవరైతే ఇంటి స్థలాలను విక్రయించారో ఆధారాలతో సహా ఇస్తే చర్యలు తీసుకుంటామని డీటీ రిషి తెలిపారు. దీనిపై విచారణ చేస్తామన్నారు.

అజెండా అంశాలన్నీ ఆమోదం

అజెండాలోని తొమ్మిది అంశాలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇందులో ఎస్‌ఎఫ్‌సీ ద్వారా రూ.8.57లక్షలతో సీసీ రోడ్లు, పైపులైన్లున్నాయి. అలాగే రూ.17లక్షల సాధారణ నిధులతో అభివృద్ధి పనులు, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రూ.26.18 లక్షలతో అభివృద్ధి పనులున్నాయి. ఇలా ఉండగా అజెండాలోని పట్టణంలోని ఇళ్లకు ఇంటి నంబరు బోర్డుల ఏర్పాటుకు సంబంధించి జనరల్ ఫండ్స్‌లో ఖర్చు చేసే బదులు గతంలోలాగే దాతల సాయం తీసుకోవాలని కౌన్సిలర్ హైదర్ సూచించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పలు శాఖల అధికారులు, ఇన్‌చార్జి కమిషనర్ పుష్పగిరినాయక్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్పెషల్ గ్రాంట్ రూ.20 కోట్లు

- మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా వెల్లడి


మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా, పక్కన కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, కాలువల ఏర్పాటుకు రూ.20 కోట్లు మంజూరు చేశారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా వెల్లడించారు. గురువారం కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డితో కలసి మున్సిపల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. చైర్మన్ మాట్లాడుతూ, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిల ప్రత్యేక చొరవతో స్పెషల్ గ్రాంటు కింద ఈ మొత్తాన్ని మంజూరు చేశారని, ఈ నిధులతో పట్టణంలోని 31 వార్డులతో పాటు విస్తరణ ప్రాంతాలతో కలిపి సుమారు 16.53 కిలోమీటర్ల రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి గాను 230 పనులను ఎంపిక చేసి, అంచనాలు రూపొందించినట్లు చెప్పారు. అలాగే పట్టణ సుందీకరణ పనుల్లో విద్యుత్ లైన్లు, లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైన ప్రాంతాలలో మంచినీటి బోర్లు వేసి, పైపులైన్లు వేసి, ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా మంచినీరు సరఫరా చేసే కార్యక్రమానికి పూనుకున్నామన్నారు. అలాగే పట్టణంలోని కౌండిన్య నదిలో మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తరలించేందుకు వీలుగా రూ.23 కోట్లతో సిమెంటు కాంక్రీట్ కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని ఎంబిటి రోడ్డు విస్తరణకు రూ.40 కోట్లు మంజూరైందని, రోడ్డు సర్వే పనులు ప్రారంభించామన్నారు. అలాగే పుంగమ్మ చెరువు వద్ద సుమారు రూ.3 కోట్లతో పార్కు, వాకింగ్ ట్రాక్, ఎల్‌ఈడీ లైట్లు, బెంచీలు ఏర్పాటు చేసి, ఆహ్లాదకర వాతావరణం ఉండేలా పనులు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, డీఈఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు తావిస్తే వేటు


బీఎస్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అమరనాథ్

రొంపిచెర్ల: ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపులలో అక్రమాలకు తావిస్తే బీఎల్‌ఓలపై వేటు తప్పదని తహసీల్దార్ అమరనాథ్ హెచ్చరించారు. గురువారం తన కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, బదిలీలకు అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. అలాగే ఒక పోలింగ్ బూత్ నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ఓటును బదిలీ చేసుకోవచ్చన్నారు. పేర్లు, చిరునామాల్లో తప్పిదాలు ఉంటే వాటిని కూడా సవరించుకోవచ్చన్నారు. రెండుచోట్ల ఓట్లు ఉంటే ఒక చోట తొలగించాలని అన్నారు. సమావేశంలో టీడీలు లోకేష్, వెంకట రమణారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ ఖాదర్, ఏఎస్‌ఓ రాజేశ్వరి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

253 మందికి పెన్షన్లు మంజూరు

రొంపిచెర్ల: మండలంలో 253 మందికి వివిధ పెన్షన్లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. బండకిందపల్లె సచివాలయ పరిధిలో 20, బొమ్మయ్యగారిపల్లెలో 45, చిచ్చిలివారిపల్లెలో 30, గానుగచింతలో 28, మోటుమల్లెలలో42, పెద్దమల్లెలలో 26, రొంపిచెర్ల-1లో 35, రొంపిచెర్ల-2లో 27 మందికి పెన్షన్లు మంజూరు అయ్యాయని వివరించారు. వీటిలో డప్పు కళాకారులకు 11, వికలాంగులకు 46, మత్స్యకారులకు 2, వృద్ధులకు 127, ఒంటరి మహిళ 1, వితంతువులు 66 మంది పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఈ పెన్షన్లను సెప్టెంబర్ 4న పంపిణీ చేస్తామని జెడ్పీటీసీ తెలియజేశారు.

కుప్పంలో వర్షం


నేలకూలిన చెట్టును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

కుప్పం రూరల్: కుప్పం పట్టణంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం అర్ధ గంట పాటు కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. వర్షానికి యాక్సిస్ బ్యాంకు పక్కన ఉన్న సోమయ్య వీధిలో పెద్ద చెట్టు ఇళ్లపై పడింది. ఇది తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఫైర్ సిబ్బంది, మున్సిపాలిటీ కార్మికులతో చెట్టును తొలగించారు. చెట్టు నేలకూలినప్పుడు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు.

సంక్షేమ హాస్టళ్లలో ఉత్తీర్ణత శాతం పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నారాయణ, తహసీల్దార్ సీతారామన్, సోమల ఎంపీపీ ఈశ్వరయ్య తో కలసి ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహులు నియోజకవర్గంలోని ఆరు మండలాల వార్డెన్లతో సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ , బీసీ వసతి గృహాలలో ఉత్తీర్ణత శాతం తగ్గడంపై చర్చించారు. ఎంపీపీ మాట్లాడారు. ఉత్తీర్ణత తగ్గితే కారకులు సంక్షేమాధికారులేనని, వారిపై చర్యలకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన


పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు గురువారం పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాతూరు సామి. కోటి, ముసలిమొడుగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని డాక్యుమెంట్ రైటర్లు మూడవ రోజు గురువారం కూడా పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తం చేశారు. సంఘ నాయకులు పూల త్యాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రామమూర్తి, రెడ్డిపల్లి రవీంద్ర, పవన్ కుమార్, సోమల బాబు, జగదీష్, మునిరాజ, హరినాథ్‌బాబు, సాదిక్, మస్తాన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రొంపిచెర్ల: సైబర్ నేరాలపై రొంపిచెర్ల పురవీధులలో గురువారం స్థానిక ఆకాష్ స్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ మోసాల మూలాన ప్రజలు ఎక్కువగా నష్టపోతున్నారని, దీనిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే వివిధ సామాజిక మాధ్యమాలకు బానిసలు కారాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్‌పర్సన్ సంగీత, ప్రిన్సిపల్ వందనారెడ్డి, కరస్పాండెంట్ ద్వారక, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఏనుగు తరలింపుతో కరెంట్ కట్

గుడిపాల: ఒంటరి ఏనుగు తరలింపు నేపథ్యంలో గుడిపాలలో కరెంట్ సరఫరా కట్ చేశారు. 197 రామాపురం నుంచి ఈచర్ వ్యాన్‌లో ఒంటరి ఏనుగును తీసుకువెళుతున్న సందర్భంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ తీగలపై తొండంతో దాడి చేస్తుందన్న అనుమానంతో అటవీశాఖ అధికారుల సూచనల మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ కరీముల్లా తెలియజేశారు. రాత్రి 8 నుంచి 10:30 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేశారు.